# ఎస్ఐ అభ్యర్థులకు 800 మీటర్ల పరుగు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎస్ఐ రిక్రూట్‌మెంట్‌లో పరీక్షలో భాగంగా అభ్యర్థులు తప్పనిసరిగా 800 మీటర్ల పరుగులో పాల్గొనాలని తెలంగాణ స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ జే పూర్ణచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనతో తెలిపారు. ఎస్ఐ రాత పరీక్షల్లో అర్హత సాధించిన దాదాపు 40 శాతం మంది అభ్యర్థులు పీఈటీ(శరీర దారుఢ్య) పరీక్షల్లో పాల్గొంటారన్నారు. ఎస్ఐ అభ్యర్థుల్లో పురుషులు 800 మీటర్లు, మహిళలు 100 మీటర్ల పరుగులో అర్హత సాధిస్తేనే వారిని ఫిజికల్ మెజర్‌మెంట్ పరీక్షలకు సిఫారసు చేస్తామన్నారు. ఆ పరీక్షల్లో కూడా అర్హత సాధించిన వారిని మిగతా పీఈటీ పోటీ పరీక్షల్లో పాల్గొనేందుకు అనుమతి ఇస్తామని పేర్కొన్నారు. ఈ ఎంపిక పరీక్షలు రాష్ట్రంలో మొత్తం 13 కేంద్రాల్లో నిర్వహిస్తామని, అభ్యర్థుల ఆధార్ కార్డు, బయోమెట్రిక్ వేలి ముద్రలను పరిశీలిస్తామని తెలిపారు. ఈ విధమైన ప్రక్రియను జూలై 15వ తేదీ నుంచి జరిగే పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో కూడా అనుసరిస్తామని, 1,92,588 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు అర్హత పరీక్షలు నిర్వహిస్తామని బోర్డు చైర్మన్ తెలిపారు.